**సాయిని అనుసరించండి, సత్యమార్గంలో నడవండి!**

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యమందణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరయ్య!

సర్వత్రా సత్యమే వ్యాపించియున్నది. సర్వత్రా సత్యమే సంచరించుచున్నది. సర్వత్రా సత్యమునే దర్శించుచున్నాము. మన దర్శన, స్పర్శన, సంభాషణములన్నీ సత్యముతో కూడినవే! సత్యమునకొక రూపము లేదు. మనము దేనిని చూచినా అది సత్యమే! (స్వామి ఒక ఉంగరము సృష్టించారు) ఇది సత్యము. ఇది ఎక్కడనుండి వచ్చినది? సత్యమునుండియే వచ్చినది. సత్యములోనే చేరిపోతుంది (అందరూ చూస్తుండగా స్వామి దివ్య హస్తమునుండి ఆ ఉంగరము అదృశ్యమైనది) 'సర్వం ఖల్విదం బ్రహ్మ' సత్యమే బ్రహ్మ స్వరూపము. సత్యము రెండు కాదు. ఒక్కటే! అయినప్పటికీ సత్యమును గుర్తించటానికి చాలా ప్రయత్నము చేయవలసి వుంటుంది. సత్యమనగా కేవలము వాక్కుతో చేరినది మాత్రమే కాదు. సత్యము అనేకవిధములైన అవతారములు ధరించినటువంటిది. 'అనంత రూపం బ్రహ్మ'. సర్వమూ బ్రహ్మమయమే. కనుకనే, 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అన్నారు. మిగిలినదంతయూ దాని ప్రతిబింబమే తప్ప అన్యము కాదు. సత్యము ఒక్కటే అయినప్పటికీ అనేక రూపనామములతో దర్శనమిస్తుంటుంది. సర్వమూ సత్యమునుండి పుట్టినటువంటిదే. సత్యమునుండి ధర్మము వచ్చింది. 'సత్యాన్నాస్తి పరో ధర్మః' సత్యధర్మములు ఏకమైనప్పుడు శాంతి ఏర్పడుతుంది. శాంతి వలన ప్రేమ, ప్రేమనుంచి ఆనందము ఆవిర్భవిస్తున్నాయి. ఎప్పుడు ప్రేమ పుట్టినదో అప్పుడు ద్వేషము నిర్మూలమై అహింస ప్రారంభమౌతుంది. కాబట్టి, ఈనాడు అహింస అనేది కావాలంటే ప్రేమను అభివృద్ధి చేసుకోవాలి. ప్రేమ ఒక్కటి వుండెనా, సర్వులూ ఏకమైపోతారు.

'మీరు నేనే, నేను మీరే'

'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'. 'అందరూ నా అంసములే, మీరు ప్రత్యేకమైనటువంటి వారు కాదు. మీరు నా ప్రతిబింబములే! మీరు నేనే, నేను మీరే!' రూపనామములు వేరు కావచ్చు. కాని, అందరియందున్నది ఒక్కటే ఆత్మ. ఒక్కొక్క శరీరమునకు ఒక్కొక్క పేరు పెట్టారు. ఈ పేర్లు కేవలం గుర్తింపుకోసం పెట్టినవేగాని మీ నిజతత్త్వమును నిరూపించునవి కావు. ఆత్మయే మీ నిజతత్త్వము. కనుక, ఆత్మను ప్రేమించండి. అట్టి ప్రేమను అభివృద్ధి పరచుకున్నప్పుడు సర్వులు కూడను ఏకము కావచ్చు.మనకు భేదభావములు ఏమాత్రమూ సంభవించవు. ద్వైతభావము అప్పుడు కనిపించదు. ద్వైతభావము లేనప్పుడు అంతా ఒక్కటే! A man with dual mind is half blind. మనము గ్రుడ్డివారం కారాదు. మనకు రెండు కన్నులున్నాయి. రెండూ చేరి ఒకదానినే చూస్తున్నాయి. కనుక, మనమందరముకూడా ఒక్కటే. మానవ సోదరత్వము, దైవపితృత్వము. ఈవిధమైన భావమును పోషించుకున్నప్పుడు ఈ జగత్తులో భేదములు, కలహములు, కల్లోలములు, అశాంతులు కానరావు. మానవులంతా ఏకమౌతారు.

నీవంటావు, 'నేను మానవుడను' అని. అయితే, మానవుడంటే ఎవరు? కామ, క్రోధములతో కూడినవాడా? కాదు, కాదు. 'మానవ' అనగా భేదము లేకుండా జీవించేవాడని అర్థము. మనలో ఎటువంటి భేదములు తలెత్తకూడదు. మనమందరం ఆత్మస్వరూపులమే! అందరం ఒకే తండ్రి హిడ్డలమే! రూపనామములను పురస్కరించుకొని భేదభావములను అభివృద్ధి పరచుకోకూడదు. ఎక్కడికి పోయినప్పటికీ మనము ఏకంగా వుండాలి. అయిదు వ్రేళ్ళు వేరువేరుగా వున్నప్పటీకీ హస్తము ఒక్కటే!

శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటే
జీవజాతులు వేరు జీవుండు ఒక్కడే
నీతిజాతులు వేరు జన్మమొక్కటే.

చూడండి, ఇక్కడ ఇన్ని బల్బులు వెలుగుతున్నాయి. బల్బులు వేరుగా వుండినప్పటికీ కరెంటు ఒక్కటే! ఈ దేహాలన్నీకూడను బల్బుల వంటివి. ఒక్కొక్క బల్బు ఒక్కొక్క 'పవర్'తో వుండవచ్చు. అట్లే, మానవులందరూ ఒక్కటే అయినప్పటికీ 'పవర్'లో వ్యత్యాసముంటున్నాది. కాని, అందరిలో ఆత్మ ఒక్కటే. ఇట్టి ఏకత్వాన్ని మీకు చూపించాలంటే నాకెంతే ఆనందంగా వుంటుంది. కాని, నాకు కొన్ని లక్షల జాబులు వచ్చినాయి. 'స్వామీ! మీరు లింగము ఉద్భవింపచేయవద్దు' అని చాలామంది డాక్టర్లు కూడను 'ఇది మంచిది కాదు' అంటున్నారు. దేహములోనున్న సువర్ణము రక్తములో ద్రవరూపంలో వుంటున్నది. ఇది ఘనరూపము దాల్చవలెనంటే దీనికి ఎంతో ఎనర్జీని వుపయోగించాలి. ఇందుకు దేహానికి తగిన బలముకూడా వుండాలి. ఒక్కొక్క లింగము

ఎంతో బరువుంటుంది. 'వీటిని ఉద్భవింపజేసే నిమిత్తమై మీరు ఈవిధంగా 'ఎనర్జీ'ని వినియోగించటం మంచిది కాదు. నమ్మిన వారిని నమ్మనీయండి. నమ్మకపోయిన వారిని న్మకపోనీయండి. మీ దేహాన్ని మాత్రము ఎక్కువ శ్రమ పెట్టుకోకండి. మాకు మీ దేహము చాలా ప్రధానము. దేహాన్ని ఆశ్రయించి మేము మీ చెంతకు చేరాము. మీ దేహాన్ని మీరు బలహీనపరచుకుంటే మాకు చాలా బాధ కలుగుతుంది. కనుక, మమ్మల్ని అనుగ్రహించి ఈ శక్తిని మీరు కొంతవరకు అరికట్టుకోవాలి' అని ప్రార్థించారు. ఈ దేహము 'పోజిటివ్' పైన ఆధారపడి ఉన్నది. 'పోజిటివ్' పోయిందంటే 'నెగిటివ్' వ్యర్థమైపోతుంది. అయితే భగవంతుడు తన సంకల్పముచేత ఏదైనా సాధించవచ్చు. ఆకాశమును భూమిగా, భూమిని ఆకాశముగా మార్చవచ్చు. కాని, దీనివల్ల కలిగే ప్రయోజనమేమిటి? ఆకాశమును భూమిగాను, భూమిని ఆకాశముగాను మార్చితే తరువాత సాధకుల గతి ఏమిటి? 'మీరు ప్రజలయొక్క తప్తి కోసమని, ప్రజలను అనందపెట్టడం కోసమని మీ శక్తిని ఈవిధముగా వినియోగించకూడదు' అని భక్తులు ప్రార్థిస్తున్నారు. ఇప్పటికే ఈ దేహమునకు 81 సంవత్సరములైనవి. ఇది ఇంకా కొంతకాలము మాత్రం వుండగలదు. మీకు అనేకవిధములైన ఆనందమును అందించే నిమిత్తమై నేను దీనిని నిల్పుకోవాలి. త్వరలోనే మీకు అనంతమైన ఆనందాన్ని అందిస్తాను. దేహమును చూచి ఆనందించే భౌతికమైన ప్రజలకు దేహమే ప్రధానము, దేహమే ప్రమాణము. కాబట్టి, ఇంతటి ప్రధానమై ఈ దేహమును సంరక్షించుకోటం నాకూ ఒక కర్తవ్యమే!

*నిజమైన హిందువు*

భక్తి అనేది మన భారతదేశమునకు చాలా ప్రధానమైనది. మీరు భారతదేశమును హిందూదేశమని అంటారు. HINDU అనే ఐదక్షరములు పంచభూతములకు, పంచప్రాణములకు ప్రతీకలు. H- Humility, I- Individuality, N- Nationality, D- Divinity, U-Unity. మీరు యూనిటీగా వున్నప్పుడు 'డివినిటీ'ని అభివృది&ధ చేసుకోవచ్చు. 'డివినిటీ'ని అభివృద్ధి చేసుకున్నప్పుడే మనకు శాంతి, సంతోషములు చేకూరగలవు. మనం జాతీయతాభావమును కాపాడుకోవాలి. జాతి సమైక్యత పట్ల విశ్వాసాన్ని మనస్సులో పెట్టుకోవాలి. జాతీయతాభావమును కాపాడేది ఏమిటి? అదే వ్యక్తిత్వం. అదే మానవజాతిని పోషిస్తుంది.

ప్రపంచములో అన్నింటినీ కొంతవరకు మనము ఒక లిమిట్‌లో పెట్టుకోవాలి. అప్పుడే మనకు శాంతి చిక్కుతుంది. భగవంతుడు ఎక్కడ చూచినా వున్నాడు. 'సత్యంబునుండి సర్వంబు సృష్టించె. సత్యంబునందణగె సర్వసృష్టి' సర్వసృష్టి తత్త్వము సమష్టి తత్త్వమే. సర్వత్రా సమత్వమే కనిపిస్తుంది. దైవము ఎక్కడ వున్నాడని అనుకోకండి. మీరందరూ దైవస్వరూపులే. ఆ తత్త్వాన్ని మీరు మనస్సులో పెట్టుకోవాలి. ఈ సత్యము ప్రతి ఒక్క మానవునకు ప్రత్యక్షంగా దర్శనమిస్తున్నది. నీవు కన్నులు మూసుకొని యోచించు. 'నేనెవరు?' అని ప్రశ్న వేసుకో. నీవు కన్నులు మూసుకున్నప్పుడు నీకేమి కనిపిస్తున్నాది? ఏమీ కనిపించటం లేదు. 'నీవు ఎవరు? నేను ఎవరు?' అనే ప్రశ్న మాత్రం వినిపిస్తున్నాది. అప్పుడు తెలుస్తుంది, 'నేను దేహాన్ని కాదు' అని. ఈ రూపనామములన్నీ కూడను మార్పు చెందునవేగాని, శాశ్వతంగా వుండేవి కావు.

కాయము కష్టపడి పనిచేసే నిమిత్తము ఏర్పడినది. కష్టము లేకపోతే సుఖమే మనకు ప్రాప్తించదు. కాబట్టి, కష్టము లేకపోయినా దానిని మనము తెప్పించుకోవాలి. Pleasure is an interval between two pains. రెండు బాధల మధ్యలోనే ఒక సుఖము చిక్కుతుంది. ఎక్కడ మనకు కష్టము కలిగిందో అక్కడే సుఖము ప్రాప్తిస్తుంది. కష్టము కొద్దికాలమే తప్ప ఎక్కువ కాలము వుండదు. ఎక్కువ సుఖమును సంపాదించాలంటే మనము కష్టమును కొంచెమైనా అనుభవించాలి.

*ఆత్మతత్త్వాన్ని విశ్వసిస్తే అదే మిమ్మల్ని రక్షిస్తుంది.*

ఒకానొక సమయంలో పురందరదాసు చెప్పాడు, 'రామా! నెమలిపిఛమునకు రంగులు వేసిన వారెవరు? పచ్చని చిలుకకు ఎఱ్ఱని ముక్కు పెట్టి దానిని అందంగా తీర్చిదిద్దినవారెవరు? కొండమీద పుట్టిన వృక్షమునకు కట్టకట్టి నీరు పెట్టినవారెవరు? రాతిలో పుట్టిన కప్పకు ఆహారమును అందిస్తున్నవారెవరు? అన్నింటికీ నీవే ఆధారం. మానవత్వమునకు దివ్యత్వమే ప్రత్యక్ష సాక్షి. కాబట్టి, నీవు అందరినీ రక్షించాలి. అందరిలోవుండి రక్షించాలి. నీవు ఆత్మస్వరూపుడవై అందరియందూ వున్నావు. ఓ దైవమా! ఈ సత్యాన్ని అర్థం చేసుకోటానికి అందరికీ సరైన బుద్ధిని ప్రసాదించు'. ఆత్మతత్త్వాన్ని మనము విశ్వసించాలి. ఆత్మకు ఎట్టి నామరూపములూ లేవు. అయినప్పటికీ ఆత్మతత్త్వాన్ని మీరు విశ్వసిస్తే అదే మీకు సర్వరక్షగా వుంటుంది. ఆత్మను రక్షించేది ఆత్మయేగాని వేరొకటి కాదు. ఆత్మయే ప్రత్యక్ష దైవము. 'సర్వతః పాణిపాదం....' సర్వభూతములందున్న ఆత్మతత్త్వమే సత్యమైనది, నిత్యమైనది. ఆత్మయే అన్నింటియందు చేరియున్నది. ఆత్మను విభజింప వీలుకాదు. బల్బులు వేరైనా ప్రసరించే కరెంటు ఒక్కటే! ఒకచోట వైరు కట్‌చేస్తే వెలుగుతున్న బల్బులన్నీ ఆరిపోతాయి. అదేరీతిగా, దేహములనే బల్బులు వేరువేరుగా వున్నప్పటికీ వాటిలో ప్రసరించే ఆత్మ అనే కరెంటులో ఏమాత్రం వ్యత్యాసం లేదు.

సహజమైన జీవితాన్ని గడపండి

విద్యార్థులారా! ఈనాడు సైన్సు విపరీతములైన వికారములను సృష్టించుచున్నది. దీనివలన అనేకరకములైన బాధలు సంభవించుచున్నవి. అమెరికాలో పశువులకు మాంసం తినిపిస్తున్నారు. అవి మాంసం తినటం వలన ఎక్కువ పాలిస్తాయని వారి ఆశ. కాని, వాటికి వేరే జబ్బులు వస్తున్నాయి. ఆ పాలు త్రాగిన వారికికూడా అనేక జబ్బులు ప్రారంభమవుతున్నాయి. ఈనాడు ఒక్కొక్క దేశము ఒక్కొక్క రకమైన మార్పును కలిగిస్తున్నది. ఒక్క భారతీయులు మాత్రమే సహజమైన జీవితమును గడుపుతున్నారు. 'ఆర్టిఫిసియల్ లైఫ్'ను గడపకూడదు. కృత్రిమమైన జీవితాన్ని గడిపితే మనకు లభించేవన్నీకూడా కృత్రిమంగానే వుంటాయి. ఒక చిన్న విషయాన్ని మీరు గమనించండి. ఈనాడు కూరగాయలయందుకూడను ఎంతో మార్పు కలిగింది. మనము ఎంతో ఆకుకూర తినేటువంటివారము. ఆకుకూరలు ఎంతో బలమునిచ్చేటువంటివి. కాని, ఇప్పుడా ఆకుకూరలకు డ్రైనేజి వాటర్ కట్టి వాటిని కలుషితం గావిస్తున్నారు. ఈనాడు కూరగాయలు, ఆకుకూరలన్నీ కూడను పడైపోయినవి. వంకాయకూర అంటే చాలా మందికి ఇష్టం. ఒక కవి చెప్పాడు, 'వంకాయవంటి కూరయు, పంకజముఖి సీతవంటి భామామణియున్, శంకరునివంటి దైవము లంకాధిపు వైరివంటి రాజులు గలరా!' కాని, ఈనాటి వంకాయలకు ఇది వర్తించదు. అవి పూర్తి పాడైపోయాయి. ఈవిధమైన పొల్యూషన్ పెరిగిపోవటం వలన మనలో వున్న భావములుకూడా మలినమై పోతున్నాయి.

విద్యార్థులారా! మీరెంతయో చదువుకున్నటువంటివారు. పిచ్చిపిచ్చి పుస్తకాలను చదివి మీ మనస్సును మలినపరచుకోకండి. పవిత్రమైన మన భారతీయ సంస్కృతిని అనుసరించండి. ఈ పవిత్రతను మన ప్రాచీనులు ఎంతో ఆనందంగా అనుభవిస్తూ వచ్చారు. కొంతకాలమునకు విదేశీయులుకూడా భారతీయుల చరిత్రయొక్క సత్యమును గురించి తమలో మార్పు తెచ్చుకుంటున్నారు. అయితే, అంతవరకు మనము కాచుకోనక్కరలేదు. ఎప్పటికప్పుడే మనము సరైన మార్గమును ననుసరిద్దాము. దైవము ప్రతి విషయమునూ గుర్తింస్తుంటాడు. మనల్ని అన్నివిధములుగా రక్షిస్తూ వుఎంటాడు. దైవమే మన వెంట వుండగా మనము దేనికీ భయపడనక్కలేదు.

నేనెప్పుడూ సత్యానికే కట్టుబడి వుంటాను

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం నేను పల్లెలో సభలు జరిపేవాడిని. బీదవారందరికీ సహాయం చెయాలని ముందుకు పోయేవాడిని. ఒక నిక్కరు, చొక్కా వేసుకొని నేను ప్రజల్లోకి పోతుంటే అందరూ నన్ను వారించి ఒక అడ్డ పంచె తెచ్చి నాకు కట్టేవారు. నేను మాల ఇండ్లకు వెళ్ళేవాడిని. శ్రీమంతుల నుద్దేశించి ఒక పాట వ్రాసి నేను మాలవాళ్ళకు నేర్పించాను.

నేలను దున్ని విత్తులు నాటి పంటలు పండిస్తే
మీరు మేడలోనుండి మెట్లే దిగక మింగి కూర్చుంటే
చాకిరి అంతా మా పాలా, సౌఖ్యమంతా మీ పాలా!

'మాకు చెప్పటానికి మీరెవ్వ?' అని శ్రీమంతులు ఎవరైనా ఎదురు తిరిగితే వారికి చక్కని జవాబు యిచ్చేటువంటివారు.

దేవిడిచ్చిన ధరణిరా ఇది ఎవడి అబ్బ సొమ్ము?
బలవంతులమని పైబడ వస్తే భగవంతుడు లేడా!
సహోదరత్వము సాధించేటి మహాత్ములే లేరా!
మేలుకోండి, మేలుకోండి, మాయ మరువండి.

ఈవిధంగా పాచలు వ్రాసి నేను బీదవారికి నేర్పిస్తుంటే ధనికులకు నాపై కోపం వచ్చేది. ఈ దేహముయొక్క అన్నగారు కూడా వచ్చి చెంపదెబ్బలు వేసి, 'నీవెందుకు పబ్లిక్‌లోకి పోతావు? ఇంట్లో కూర్చొని చదువుకో. నీవు ఇంటినుండి బయటకు పోకూడదు' అని గట్టిగా మందలించి ఒక రూములో పెట్టి తాళం వేసేవాడు. అక్కడికి అందరూ వచ్చి, 'రాజూ, రాజూ, రాజూ' అని పిలచేవారు పాపం. 'నాయనలారా! కొంతసేపు ఓపిక పట్టండి. నేను తప్పకుండా వస్తాను. నేను మీవాడను. మీ అభీష్టాలను నేను నెరవేరుస్తాను' అని వారికెంతో ధైర్యం చెప్పేవాడిని. ఈవిధంగా ఆనాటి మొదలు నేటి వరకు బీదలకు నేను తోడ్పడుతూనే వున్నాను. బీదలను సంరక్షించటం, వారిని పోషించటం, వారికి అన్నపానాదులు నివ్వటం, ఆనందాన్ని అందించటం... ఇది నా కర్తవ్యం. నేటికి కూడను మా విద్యార్థులను గ్రామగ్రామాల్లో వీధివీధికి పంపించి అన్నం పెట్టిస్తున్నాను. ఇంటి ముందుకు ఎవరైనా ఆకలితో వస్తే నేను తినటం మాని నా తట్టలోనిది తెచ్చి వానికి పెట్టేవాడిని, కట్టుకోటానికి దుస్తులు లేవని వచ్చేవారికి నేను తొడుకున్న చొక్కా తీసి యిచ్చేవాడిని. ఈవిధముగా ప్రతి ఒక్కరికీ ఎంతో సహాయము చేస్తూ వచ్చాను. ఆనాటినుండి 'హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్' ఇదే నా ధ్యేయం. ఈవిధముగా చిన్నతనమునుండి ఇతరులకు సహాయం చేయటంలో నాకెంతో

అనుభవమున్నది. అనేకమంది సహాయం చేయాలని చెబుతారుగాని తాము స్వయంగా చెయ్యరు.

మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం
మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనాం.

ఆనాటినుండి నేటివరకు నేను అందరినీ సంరక్షిస్తూ, పోషిస్తూ, బుద్ధులు చెబుతూ, శ్రేయోమార్గములో నడిపిస్తూ వస్తున్నాను. ఎవ్వరికీ నేను ఎట్టి అపకారమూ చేయలేదు. ద్వేషముగాని, క్రోధముగాని ఎవ్వరిపైనా నేను చూపలేదు. కాని, నేను పైకి వస్తున్నాననే అసూయచేత కొందరు నాపైన అనేక రకములైన కట్టుకథలు కల్పించి, పేపర్లవాళ్ళకు వ్రాసి, వాళ్ళచేత అనేకరకములుగా దుష్ప్రచారం చేయిస్తున్నారు. ఎవరు ఏమి చేసిననూ నేను దేనికీ భయపడను. నేను ఎప్పుడూ సత్యం... సత్యం... సత్యానికే కట్టుబడి వుంటాను. ఈ దేహము పేరే సత్యము. నేనెప్పుడూ సత్యమును వదలి మరో దారి పట్టను. ద్వేషముతో ఎవరు దుష్ప్రచారము చేస్తారో వారికి బుద్ధి చెప్పటానికి ముందుకు వస్తాను. ఇకముందు వారు ఇటువంటి దుష్ప్రచారమునకు పాల్పడకుండా తగినటువంటి చర్యతీసుకోవాలి. వారేదో డబ్బుకి ఆశపడి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారు. తాము చేసే తప్పును గుర్తించటానికి వారు ప్రయత్నించాలి.

నేను చేసే సర్వ కర్మలూ మీకోసమే

నాలో ఏనాడూ ఎట్టి దోషములూ అణుమాత్రమైనా కనిపించవు. కనుక, మీరందరూ సాయిని అనుసరించండి. దైవచింతన చేసుకుంటూ సత్యమార్గములో నడవండి. సత్యమార్గమను అనుసరిస్తే మీరు దేనినైనా సాధించగలరు. నేను ఎవ్వరినీ బాధపెట్టాలని ఎప్పుడూకూడా తలచుకోలేదు. అసలు అటువంటి ఆలోచనలు నాదగ్గరకి రావు. ఏది చేసినా మీకోసమేగాని నాకోసం కాదు. నేను తినే భోజనము మీకోసమే. నేను త్రాగే నీరు మీకోసమే. నేను చేసే సర్వ కర్మలు మీ నమిత్తమై చేస్తున్నాను. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించిన వారు ధన్యులౌతారు.

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రజలు కలుషితమైన నీరు త్రాగుతున్నారు. వాళ్ళను నేనింకా చూడలేదు. కాని, వారు త్రాగుతున్న నీరు కలుషితమైనదని తెలిసి నేను చాలా బాధపడ్డాను. వారికి మంచినీరు అందించే నిమిత్తం వంద కోట్ల రూపాయలు ఖర్చు పెట్టించాను. క్రింద గోదావరి ప్రవహిస్తున్నది. కాని, ఒక్క చుక్కైనా వారు ఏనాడూ త్రాగలేదు. ఆ నీటిని పైపుల ద్వారా పైకి ఎక్కించి వారికి త్రాగునీరు అందించాను. ఇప్పుడు వారందరూ ఎంతో ఆనందిస్తున్నారు. సాధ్యమైనంతవరకు అందరికీ మంచి చేయటానికి ప్రయత్నించాలి. అప్పుడు మనకుకూడా మంచే కలుగుతుంది. ఆనందం కలుగుతుంది.

విద్యార్థులారా!మీకెవరైనా ద్వేషి ఎదురైతే 'ఓ మిత్రమా!' అని ప్రేమతో పలుకరించి నమస్కరించండి. అప్పుడు వారుకూడా మిమ్మల్ని ప్రేమతో పలుకరిస్తారు. అందరూ సోదరులే. ఆవిధంగా మీరు నడచుకొన్నప్పుడే మన సత్యసాయి ఇన్‌స్టిట్యూట్‌కు సత్కీర్తిని సాధించనవారౌతారు. పిల్లల దగ్గర మేము ఒక నయాపైస తీసుకోటం లేదు. ఎగ్జామినేషన్ ఫీజు కూడా తీసుకోటం లేదు. అందరూ వచ్చి అక్కడ ఉచితంగా డిగ్రీలు పొంది తిరిగి వెడుతున్నారు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టి చాలా మందిచేత పి. హెచ్.డి చేయిస్తున్నాను. ఈవిధంగా పిల్లలందరూ ఆదర్శప్రాయులై అభివృద్ధి చెందుతే మన దేశమెంతో మంచి పేరు పొందుతుంది. మా పిల్లల మంచితనం గురించి అమెరికానుండి కూడా మాకు సమాచారం అందుతున్నది. 'స్వామీ! మా దేశంలో మీ పిల్లలు అనేకమంది వున్నారు. వాళ్ళు మాకెంతో ఆనందాన్ని అందిస్తున్నారు' అన్నారు. మొన్నకూడా ఒక స్పెషల్ ప్లేను వచ్చింది. దానినిండా మా కాలేజీ పూర్వ విద్యార్థులే! తమ భార్యా పిల్లలను తీసుకొని మొత్తం 250 మంది వచ్చారు. అందరూ ఎంతో ఆనందాన్ని అనుభవించారు. 'స్వామీ! ఇంతటి ఆనందాన్ని మాకందిస్తారని మేము కలలోకూడా తలుచుకోలేదు' అన్నారు. నేను త్వరలోనే ప్రపంచ పర్యటనకూడా చేస్తాను. ఆఫ్రికానుంచి, రష్యానుంచి చాలామంది భక్తులు వస్తున్నారు. రష్యన్ల భక్తి వర్ణనాతీతం. ఇక్కడున్న విదేశీయులలో చాలామంది రష్యన్లు వున్నారు. వీరు ఎంతగానో ఆనందిస్తున్నారు. (చూడండి అక్కడ చేతులెత్తినవారందరూ రష్యన్లే) వీరందరికీ చాలా భక్తి. ( ఆభక్తునుద్దేశించి మాట్లాడుతూ, ' మీరు రష్యన్లు కాదు, మావారే, ఐ లవ్ యు ఆల్' అన్నారు)

పిల్లలూ! రష్యా, అమెరికా, జర్మనీ, జపాన్, ఇటలీ, ఫ్రాన్స్ అన్నీ వేరువేరుగా వున్నాయేగానీ అందరూ మనవారే. ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి వారే ఎంతో సహాయం చేశారు. రాత్రింబవలు పనిచేశారు. వారికి స్వామి అంటే ప్రాణము. నేను ఎక్కడికి పోయినా నా కారు వెనుక పరుగెత్తుకొని వస్తుంటారు. మొన్న మద్రాసుకు కూడా వచ్చారు. స్వామికోసం ఎంత కష్టమైనా, ఎంత ఖర్చునైనా భరించుకొని వస్తున్నారు. వారి భక్తిని చూసి మీరెంతో నేర్చుకోవాలి.